ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- ప్రజల భాగస్వామ్యంతో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు.

- భోగాపురం విమానాశ్రయాన్ని రాష్ట్ర విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి K.రామ్మోహన్ నాయుడు తెలిపారు.

- ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్న పులిని సురక్షితంగా పట్టుకోవాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

- ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కోస్తా ఆంధ్రలో రానున్న రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==========

ప్రజల భాగస్వామ్యంతో పుష్కరాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. 2027 గోదావరి పుష్కరాలపై ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈరోజు ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పుష్కరాల నిర్వహణలో యువత, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. ఇప్పటి నుంచే పుష్కర విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ, సమన్వయ సమావేశాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో 440 ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దాదాపు 649.70 కోట్ల రూపాయల విలువైన 659 పనులు ప్రారంభం కాగా, 25.53 కోట్ల రూపాయల విలువైన 69 పనులు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పుష్కరాల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

==========

ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు పరిసరాల్లోని అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్న పులిని సురక్షితంగా పట్టుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి కె.పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అధునాతన సాంకేతికతతో పాటు ఇతర రాష్ట్రాల నిపుణుల సహకారం తీసుకోవాలని అటవీశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో ప్రస్తుత పరిస్థితిపై ఈరోజు సమీక్షించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, పులి సంచార మార్గాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ సమాచారాన్ని పరిసర గ్రామాల ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు.

==========

గోవాలో జరుగుతున్న 57వ అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవం (ఇఫీ)లో భాగంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో (సీఎంఓటీ)' ఆరో విడత కార్యక్రమం ఈరోజు గోవాలోని కళా అకాడమీలో ప్రారంభమైనది. జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్.ఎఫ్.డి.సీ) ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఎంపికైన 100 మంది ప్రతిభా ప్రదర్శనకు, సినీ పరిశ్రమపై అవగాహన పెంచుకోవడానికి ఈ వేదిక దోహదపడుతుంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి చంచల్ కుమార్ మాట్లాడుతూ.. సంస్కృతి, భాష, అనుభవాల నుంచే మన మూలాలు ఏర్పడతాయని, ఊహాశక్తి, జిజ్ఞాస, కొత్తదనాన్ని ప్రయత్నించాలనే ధైర్యం నుంచే కలలు పుడతాయని ఆయన వివరించారు. కలలకు రూపమిస్తే, నైపుణ్యం వాటికి దిశానిర్దేశం చేస్తుందని, మన మూలాలే కథలకు ప్రత్యేక స్వరాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. దేశంలోని చిన్న గ్రామం నుంచి పుట్టిన కథ కూడా నిజాయితీగా చెబితే ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల మనసులను తాకగలదని అన్నారు.

==========

విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ పెట్టుబడుల సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ విలువను అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పగలిగామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. విశాఖపట్నంలో ఈరోజు వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ సదస్సు ద్వారా దాదాపు 9 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, వాటిని కేవలం ఒప్పందాలకే పరిమితం చేయకుండా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని రాష్ట్ర విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)-Net

==========

పీఎం సూర్యఘర్ పథకం అమలులో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు, సోలార్ వెండార్లు సమన్వయంతో పనిచేయాలని APEPDCL CMD ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదేశించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసి, డిసెంబర్ 15వ తేదీ నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిచేయాలని స్పష్టం చేశారు. APEPDCL కార్యాలయంలో ఈరోజు పీఎం సూర్యఘర్ పథకం అమలుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

==========

విరామం

==========

జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం పైగా స్థానాలు ఎన్డీఏ కూటమికి వచ్చాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల కంటే.. స్థానిక ఎన్నికల్లో కూటమికి ఓటింగ్ శాతం పెరిగిందని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబునాయుడు ఈరోజు మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో విజయం అందించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతు ఇదని పేర్కొన్నారు. రాజధాని అమరావతి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అమరావతిని అత్యుత్తమ రాజధానిగా తీర్చిదిద్దుతున్నామని ఉద్ఘాటించారు.

==========

సాహిత్యాన్ని సమాజ సంస్కరణ కోసం ఉపయోగించి, తెలుగు సాహిత్యానికి గురజాడ అప్పారావు వేగుచుక్కగా నిలిచారని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం.మునిరత్నం నాయుడు తెలిపారు. గురజాడ అప్పారావు 111వ వర్ధంతి సందర్భంగా ఈరోజు 'యువచైతన్య దినోత్సవం' పేరుతో విజయవాడలో గురజాడ సాహిత్యంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మునిరత్నం నాయుడు మాట్లాడుతూ, సాహిత్యం ద్వారా సంప్రదాయంలోని మంచిని గౌరవిస్తూనే, కాలం చెల్లిన దురాచారాలను ప్రశ్నించిన ధైర్యశాలి గురజాడ అని అన్నారు. ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ దృక్పథం, సాటి మనిషిపై ప్రేమను రచనల ద్వారా యువతకు అందించారన్నారు.

==========

వ్యవసాయ భూముల ఆరోగ్యాన్ని కాపాడి, నేల సారాన్ని పెంపొందించేందుకు రైతులు కృషి చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయ అధికారి జి. సునీత కోరారు. మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఈరోజు

నిర్వహించిన “ఖేత్ బచావో అభియాన్” కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, రబీలో తక్కువ కాలపరిమితి కలిగిన వరి రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా పంటను సకాలంలో పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలతో సమతుల్య ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలని కోరారు.

==========

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 1, 2 తేదీల్లో విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పారా స్పోర్ట్స్ పోటీలకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోటీల నిర్వహణపై ఈరోజు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన సహకారం అందించాలన్నారు.

==========

వెల్లింగ్టన్ వేదికగా న్యూజిలాండ్ తో జరుగుతున్న తొలి టెస్టు క్రికెట్ లో భారత్ జట్టు మ్యాచ్ పై పట్టు సాధించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్ లో 4 వికెట్ల నష్టానికి 486 పరుగులు చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్ లో 368 పరుగులకు ఆలౌటైన న్యూజిలాండ్ పై 118 పరుగుల కీలక ఆధిక్యాన్ని సంపాదించింది. భారత్ బ్యాటర్లలో ఓపెనర్ కేఎల్ రాహుల్ శతకం సాధించారు.

==========

ఉత్తర అంతర్గత ఒడిశాపై ఉన్న అల్పపీడన ప్రాంతం, ఉత్తర ఛత్తీస్ గఢ్ పరిసర ప్రాంతాలపైకి విస్తరించిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీనికి సంబంధించిన ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో దిగువ ట్రోపో ఆవరణములో దక్షిణ, నైఋతి గాలులు వీస్తున్నాయని, వీటి ఫలితంగా కోస్తా ఆంధ్రప్రదేశ్ లో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందన్నారు.

==========
==========